# ప్రతిష్ఠ

"మీరీమధ్య ఊళ్ళో లేరు. ఘోరాలు జరిగిపోతున్నాయ్" అని ఊళ్ళో పెద్దమనుషులు శశాంక శేఖర శాస్త్రి గారివద్ద గోలెట్టేరు.

"ఏం చెయ్యమన్నారు, లోకం నానాటికీ పాపపంకిలమై పోతోంది. అందుకనే స్వంత పనిమీద రాష్ట్ర కేంద్రం వెళ్ళినా, నాదృష్టి కేంద్రం ఎప్పుడూ ఈ వూరిమీదే ఉంటుంది. ఏం జరిగిందో వివరంగా చెప్పండి."

"ఏం లేదు, మీరు వెళ్ళిన పదిహేనురోజులకి కాబోలు నరసింహమూర్తి గారని ఒక స్పెషల్ ఆఫీసర్ ఈవూరి మునిసిపాలిటీకి ట్రాన్స్ఫరై వచ్చాడు. అందరిలాగా లేడు."

"మరేం, జూలు-కోరలు ఉన్నాయా?"

"మీకలా హాస్యంగానే ఉంటుంది. ఒకవిధంగా సాఫీగా జరగడానికి అలవాటుపడ్డజీవితానికి హఠాత్తుగా ఒకడొచ్చి అడ్డ

పడితే ఎలావుంటుందో..."

"ఏం చేస్తున్నాడేఁ?"

"ఎల్లయ్య విషయమే తీసుకోండి" అని ఆరంభించారు ఒకరు.

* * *

"ఇంకేంజూసుకు బతికేద్ది, కొంప గోదార్లో కలిసిపోతున్నాది బాబో" అని ఎల్లయ్య హడావిడిగా పరుగెత్తుకొచ్చేడు. ఆ కంగారుచూసి వాడి పెళ్ళాం పానకాలు నోటమాట రాలేదు. తల్లినూకాలు సరేసరి. "ఏటి జరిగిందేటి? నీ గోల సూసి నా పైపేనాలు పైనే పోతున్నాయి. ఏటొచ్చిపడింది? మద్దెని నీ పెళ్ళాం గోల సూల్లేకుండావున్నాం. ఓరి డిప్పగా, బేగి సెప్పరా?"

ఎల్లయ్యకి మెయిన్ రోడ్డుమీద కిళ్ళీకొట్టు వ్యాపారం. స్పెషల్ ఆఫీసరుగారు మెయిన్‌రోడ్డుకి అటూ ఇటూ అక్రమంగా ఆక్రమించబడ్డ షాపులవారందరికీ వారంరోజులలోగా షాపులు తీసెయ్యమనీ, అలా తీసెయ్యనిపక్షంలో ఎన్‌క్రోచ్‌మెంట్ నేరంక్రింద శిక్ష వేస్తామనీ ఉత్తరువులు జారీచేశాడట.

"ఆ నిలువెత్తు ఇగ్రహామూ, కంగుమనే ఆ సారమూ, బయమేసే ఆ సూపూ, అందరు పైఅధికారులులాగా నేదు బాబో......దమ్మ పెబువులు ఆ ఎమ్మెల్యే బాబుగోరు 'నీ యాపారం నువు సూసుకో ఎల్లిగా, ఆ పైన నేవున్నాను' అని బరోసా యిచ్చేవోరు. ఇదేటి? తింటూ తింటూన్న కూడులో నీల్లోసేసినాడు ఆమఛండ్రో!"

ఎల్లయ్య మళ్ళీ రాగాలు ప్రారంభించాడు. సూకాలు మూతి మూరెడు చేసింది. "ఓయబ్బో! ఈడి బాబు అమ్మమ్మ మొగుడులాంటోళ్ళని సూసినాం. ఈ మాత్ర రానికే బెగిలిపోతే యిన్నాళ్ళనుట్టి యిన్నిరకాల యవ్వారాలు సెయ్యగల్గుదుమా? ఓసి పానకాలూ! ఇంకా సూత్తా వేటే? బేగిలేసి కొప్పు సవరించుకోని, ఆ సిలకాకుపచ్చ సిలుకు సీర సింగారించుకో. ఓరి వెర్రిబాగులకొడక! వెంటనే లేసి ఓ రిక్షా కేకేసుకురా. మొన్న సింహాసలం కాడ్నుంచి తెప్పిస్తివే, ఆ యెర్ర అంటిపళ్ళగెల ఆ రిక్షాలో ఎట్టించు. ఒసే, పానకాలూ! నే సెప్పింది యాదుంచుకో. అమ్మగోరి కింత పసుపూ కుంకుమా యిచ్చుకుని ఇది బగుమానంగా ఇచ్చుకో. ఔసరం అయితే ఆపిచరుగోరి పాదాలు వొగ్గ మాకు. తెలిసిందా? దచ్చిన యిచ్చుకుంటే ముచ్చటపడని మారాజులున్నారా? మనమూ సూదారి." పానకాలు బైలుదేరింది.

మనసు అనేది తప్ప అన్ని రకాల దినుసులు తయారు చేసి ఉత్సవాల రోజుల్లో భక్తులు ప్రసాదాల రూపంలో దేవాలయానికి తీసికెళ్ళడం సర్వ సహజం. నరసింహమూర్తిగారి ఇల్లు అలాగే ఆ వాళ నిండిపోయింది. ఎంతకీ తలుపులు తెరవబడక పోడంతో 'ఆ దైవాన్ని నమ్ముకున్న వాళ్ళందరూ' వీధి గుమ్మాన్ని తట్టడానికి సాహసం లేక అలాగే వేచి వున్నారు. కొంతసేపటికి ఆ మేడమీద కిటికీ తలుపు ఒకటి తెరుచుకుంది.

"నరసింహా నీ దివ్య నామమంత్రముచేత పాపసంఘమును లెల్ల బ్రతుకవచ్చు!" అని జపం చేస్తున్న భక్తులందరూ నమస్కారం అన్నారు చేతులు పైకెత్తి.

"చెమించాలి నేను బంట్రోతు ఎంకట్రాజుని" అన్నాడు తలుపు తెరచిన వ్యక్తి. "నువ్వుండు ఎవరండీ, ఏవిటి మీకు నా వల్ల కావలసిన పని?" మూర్తి అక్కణ్ణుంచే అడిగాడు. కొంచెం సేపటివరకూ యెవరూ మాటాడలేక పోయారు. సకిలించడం నేర్చిన ఒక హిందీ మేష్టరు పొడి దగ్గుతో యిలా ప్రారంభించాడు. "చిత్తం చిత్తం ఆహాఁ తమరికి తెలియన్ని యేముందీ? తమరు యిలాంటివి ఒప్పుకోరని నాకు తెలుసు. కాని యేదో మా సంతుష్టిని మేము దాచుకోలేము, చిత్తగించారుకదూ? ఏదో ... ఏదీ చందమామకో నూలు పోగు" ఏదో కొంచెం ఆలోచించినట్టు మూర్తి నుదుట చిన్న ముడత పడింది. "సరే సంతోషం. ఇందరు యిన్నిరకాలు తెచ్చేరుగనుక ఒకరి దొకరితో కలసిపోయే ప్రమాదం వుంది. ఎవరు తెచ్చిన కానుకకి వారొక చిన్న చీటీకట్టి పేరురాసి సంతకంచేసి కింద మా గుమాస్తా వుంటాడూ యివ్వండి" ఇదంతా అయేసరికి అరగంట పట్టింది. భక్తుల మొహాలు సంతోషంతో విప్పారేయి కాంతల మిల మిలకీ కాసుల గల గలకీ కరిగిపోని కఠినచిత్తు డెవరు? అనుకున్నాయి.

"వెళ్ళొస్తాం బాబుగారు. మమ్మల్ని ఒక కంట చూడండి.

"అందుకే ఈ ప్రయత్నం" మళ్ళీ కిటికీ రెక్క తెరుచుకుంది. అందరూ తలలు పైకెత్తేరు.

"మళ్ళీ మన దర్శన మెప్పుడు బాబూ?"

"ఎలాగా కోర్టులో కలుసుకుంటాంగా?"

ఎవరికీ ఏం బోధపడక ఒకళ్ళ మొహాలు ఒకళ్లు చూసుకున్నారు. అతని తీక్షణమైన చూపు చూస్తేమాత్రం యేదో తెలియని భయం అందరిలోనూ ఒక్కసారి ప్రసరించింది. మళ్ళీ ఖంగుమని స్వరం వినిపించింది.

"చూడండి. ఈ వూరికి నే నొచ్చి యింకా యెంత కాలమో కాలేదు. నే నెవరో మీకూ నాకూ బంధుత్వంకాని స్నేహంకాని లేదు. మనసులో ఏదో ప్రత్యుపకారం ఊహించుకుని యిలా ముడుపులూ ముక్కుబడులూ మామూళ్ళూ బహుమానాల ముసుగులో తెచ్చి యివ్వడాన్ని న్యాయపరిభాషలో లంచం అంటారు. స్వయంగా సంతకాలూ వేలిముద్రలూ వేసిసమర్పించారు. కాబట్టి సాక్ష్యంకూడా అనవసరం. ఇవాళే కేసు పెడుతున్నాను. పునర్దర్శనం కోర్టులోనే."

కిటికీ రెక్క 'భళ్ళ'ని మూయబడింది. భక్తులీ పరీక్షకు తట్టుకోలేక పోయారు. సానకాలు లాటివాళ్ళు శోకన్నాలు ప్రారంభించారు. ఎవరి మొహాన్నీ కత్తివాటుకు నెత్తురుచుక్క లేదు. 'తప్పయిపోయింది,' "ఇది మా మొదటి తప్పుగా కాయండి. ఏదో తెలీక చేశాం. మమ్మల్ని క్షమించండి."

ఇలాంటి మాటలు వెలువడ్డాక మళ్ళీ కిటికీతలుపులు తెరుచు కున్నాయి.

"చూడండి. ఈ నగర పారిశుద్ధం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించడానికి నేను పంపబడ్డాను. నేను మీ హితవు కోరి వచ్చినవాణ్ణి కాని మీ శత్రువుని కాను. నన్ను చూసి యెందుకు భయపడతారు? నాకు దూరంగా ఉండాలని ఎందుకు ప్రయత్నిస్తారు? మీ నగరంలోని బాటలు విశాలంగా, అందంగా ఉండడం మీ కిష్టంలేదా. కిక్కిరిసిన యిళ్ళలో నివసించడం, రోజుకో యేక్సిడెంటు జరగడం ఇదే మీ కోరికా." అందరూ ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు.

"నేను వృత్తిరీత్యా ప్లీడర్ని కాకపోయినా న్యాయవాదిని. మిమ్మల్నందర్నీ కటకటాల వెనక కలుసుకోడానికి నేనిక్కడికి రాలేను. ఎవరు తీసుకొచ్చింది వారు తీసుకెళ్ళండి. ఇంకెప్పుడూ యిలాంటి ప్రయత్నాలు చెయ్యకండి. ప్రజల సొమ్ము దుర్వినియోగం చెయ్యకండి. ధర్మమార్గం తప్పించడానికి తప్పించుకోడానికి ప్రయత్నించకండి. అందరం కష్టపడి పనిచేద్దాం. ఈ నగరాన్ని ఆరోగ్యకరంగా పునర్నిర్మిద్దాం." ఇంతింత మొహాలు చేసుకుని యెవరి సొమ్ము వాళ్ళు తీసుకుని తిరుగుమొహం పట్టేరు. వాళ్ళమాటలు తలో రకంగానూ వున్నాయి. "ఇన్నాళ్ళకి ఈ ఊరికి బాగుపడే యోగం పట్టినట్టుంది."

"ఏడిసింది. ఇంతకుముందు చెడిపోయిందేమిటి గనక. అయినా యేళ్ళ తరబడి మనం బతకడం లేదూ. మనకొచ్చిన లోటేమిటంట. ఈ నాటికి ఈ పిల్లకాకిగాడొచ్చి బాగుచేస్తే గాని దిక్కులేదు కాబోలు" "చల్లగా సాగుతున్నదేదో సాగనియ్యక యెవడోవచ్చి పడుతుంటాడు యేలినాటి శని లాగ."

"ప్రాణాలతో తిరిగివెళ్ళే ఉద్దేశ్యం లేనట్టుంది. ఈ ఊరు రౌడీల రాజధాని అని తెలీదు కామాలు."

"మొట్ట మొదట అందరూ యిలా కబుర్లు చెప్పినవారే. నాలుగు మొట్టికాయలు తింటేకాని ఆ ఉడుకురక్తం తెచ్చే ఉపద్రవం తెలిసిరాదు. తనింటికి వచ్చారుగదా అని యింతలా అవమానించి పంపుతాడా? అందుకోడానికేనా అర్హత వుండాలి లెండి."

'చిన్నంతరం పెద్దంతరం' అని లేనివాడు ఎప్పటికైనా పైకొస్తాడా అని. లేకపోతే ఆ జమీందారుగారి బంగారం షాపు ఓ రెండు గజాలు రోడ్డుమీద కొచ్చిందని, నోటీసు యిచ్చినా మాటాడలేదని, కూలివాళ్ళనిపెట్టి చూరు కోయించేస్తాడా? ఇదిలా యెన్నాళ్ళు సాగుతుందో మనమూ చూద్దాం."

కాని నరసింహామూర్తిగారి శక్తి యే మాత్రమూ తగ్గలేదు. కనీసం సడలనైనా లేదు. ఆయన్ని ఏ విధంగా లొంగదీద్దామన్నా యెవరికీ వశం కాకుండా పోయింది. ఎందుచేత

నంటే యెంత చిన్న పనైనా ఆయన స్వయంగా చూచుకునే వాడు. ఊరిప్లాను తెప్పించి తనే గంటల తరబడి పరీక్షించే వాడు. ఎకౌంట్లన్నీ తనే పరిశీలించేవాడు. ఊరిలోని నగారు మూలలన్నీ కాలినడకని వెళ్ళి చూసివచ్చేవాడు. పదే పదే నిశిత పరిశీలనకి గురిచేసేగాని ఏ కాగితంమీదా సంతకం పెట్టే వాడుకాదు. ఊరు బాగుపడుతున్నకొద్దీ పెద్దమనుషులకి వూరికే చూస్తూ యేమీ చేతకానట్టు కూచోటం కష్టమై పోయింది. వీళ్ళతరబడి ఎవడి బాబుగారి సొమ్మునో తేరగా అనుభవించడం మరిగిన కొందరు పెద్దింటివాళ్ళు ఎవడో కాన్ కిస్టాయ్‌గాడువచ్చి యేవో నాలుగు సర్వేప్లానులు వెతికితీసి 'ఈ సందు మీంది కాదు' 'ఈ పెరటిలో సహం మునిసిపాలిటీ వాళ్ళదీ' అని రోజుకో సంచీ దిక్కొడుతూంటే చేతకానిచప్పు పెద్దమ్మలా కూచోడం అన్నిటికన్న అశక్యమై పోయింది. అప్పటికేనా శశాంక శేఖర శాస్త్రిగారు తిరిగిరావడం అదృష్టం కిందే భావించారు అంతరూ. తనులేని యీ కొద్దినెలల్లోనూ వూరిలో వచ్చిన మార్పులుచూసి మనసా నొచ్చుకున్న వాళ్ళలో ఆయనొకడు.

"కాలానికి ఏం పోయేకాలం వచ్చిందీ! మాకూ మా ఊరికీ శుచీ శుభ్రమూ నేర్పడానికి పైవా డెవడో పనికట్టుకు రావాలా? ఇప్పుడు మా కొచ్చిన లోటేమిటి? ఆ నాడు ఆ దొరలూ, దొరసాన్లూ దోసభూయిష్టం చెయ్యగా మిగిలిన దాన్ని పూర్తిచెయ్యడానికి వచ్చాడా యీ బుద్ధిమంతుడు! ఒక ఊరిలో రోడ్లన్నీ అలా తిన్నగా సమాంతరంగా ఉండా

లంటే యెప్పటికైనా కుదిరే విషయమేనా అది? ఇంతకీ మా చిన్నతనంలో తారురోడ్డేమిటో ఎరుగుదుమా? ఐనా మా కేమైనా లోపం వచ్చిందా? చెట్టుకిందన కూచోపెట్టి ఇసకలో చూపుడు వేలితో అక్షరాలు దిద్దించేవారు మా తాతలు మా చేత. మా పాండిత్యం యేమైనా తగ్గిపోయిందా. ఈ ఊరి స్కూలుకి సున్నం కొట్టించలేదని, ముందు తోటైనా లేదే మని అదో అల్లరా. ఇంతకీ ప్రజారాజ్యం ఇది. ప్రజా అంటే సంతతి. సందర్భాన్నిబట్టి ఇక్కడ పిల్లలు అని తీసుకున్నా తప్పులేదు. అంటే ఏమీ యెరగని పిల్లల యిష్టా రాజ్యం అన్నమాట యిది. ఇంత గూఢార్థంవుంది యిందులో. అందుకే మంకుపట్టు పట్టడం, మహా బాగా ఉడుక్కోడం, మాటాడితే అలగటం, మడతపేచీ పెట్టడం, మనకేది హితవో తెలియక పోడం, మనకే అన్నీ కావాలనడం, మనంతటివాడు లేడంటే పొంగిపోడం — ఈ సప్తవ్యసనాలూ మన మంత్రుల్నందర్నీ ఆశ్రయించి వున్నాయి. ఇవి కాదని ఎవరు యెదిర్చినా అట్టే కాలం నిలబడరు. ఇది యీ కలియుగ ధర్మం. దీని ప్రకారం నడుచుకోడం యువజన ధర్మం. అంతేగాని కండలో బలిమీ, రక్తంలో వేడిమీ తగ్గనికుర్రకారు చిన్నవాడొకడొచ్చి 'ఏదో విపరీతమైన మంచి చేసేస్తానని భీష్మించుకు కూర్చుంటే వీడు మహా అజ్ఞాని అయినా ఐవుండాలి. బొత్తిగా దుర్మార్గుడేనా ఐవుండాలి. దుర్మార్గుడైతేనే తప్పుకోడం సులువు."

"అదేమిటండోయ్."

"ఆ మర్మం తెలుసుకోలేక పోయారు. కాబట్టే మీరెప్పుడూ నాకు చిన్న పిల్లలులాగే కనిపిస్తారు."

"ఎరుగనే మీ లోన ఎప్పుడు మున్నానట, నేను చూడని మర్మమేది కలదు." అని ఆ శ్రీకృష్ణమూర్తివారు గోపికా వస్త్రాపహరణ సందర్భంలో ప్రౌఢ సుందరుల్ని ప్రశ్నించినట్టు మీ గురించీ, ఈ ఊరు గురించీ నాకు తెలియనిదేముంది చెప్పండి. దేనికైనా వయసూ అనుభవజ్ఞానమూ కావాలి నాయనా! తల నెరిసినవాని ముందు తరుణవయస్కులందరికీ ఎప్పటికైనా తలవంచక తప్పదు."

వింటున్నవారందరికీ స్థిరమైన చేయూత ఏదో దొరికినట్టు అనిపించింది.

"దుర్మార్గుడైతే తిప్పుకోడం సులువని తెలవిచ్చారే, అదెలా సాధ్యం శాస్త్రీజీ."

"అదిగో ఆ తొందరపాటూ ఆ అడ్డు సవాళ్ళే తగవు. నన్నిలా కాసేపు వాగనియ్యండి. నేను శాంతించాక మీకు కావలసినన్ని అనుమానాలు అడిగి తీర్చుకోవచ్చు. ఆఁ ఏమిటీ చెబుతున్నానూ, లోకం మంచీ చెడ్డా గురించి కదూ. మీరేమంటే అనండిగాని 'అందరిచేతా ఓహూ అనిపించుకునేంత మంచి' మీద నాకేఁ నమ్మకం లేదు. ఈ ఊర్నించి వెళ్ళిపోయిన సర్కిలిన్స్పెక్టర్ని తీసుకోండి. రాముడు వెళ్ళిపోయినపుడు అయోధ్య యేడ్చినట్టు ఆయన వెళ్ళగానే ఈ ఊరంతా బావురుమంది. అది ఈ కాలంలో సాధ్యమంటారా.

ఆ సర్కిల్ గారికి బతకనేర్చడం, లౌక్యం బాగా తెలుసు. లౌక్యం అంటేనే అసత్యపథం. అది ఉన్నప్పుడు యిక మంచి అనేదానికి అర్థమేమిటి. నిజం అనేది నిప్పులాంటిది. అపచారానికీ వ్యభిచారానికీ ఆలవాలమైన కాలంలో దానికి ఆస్కారమెక్కడ. ఇక ఈ కుర్రసన్యాసి ఊసుకొద్దాం. వీడేదో మానసిక కసరత్తుచేసి మానవుల మరమత్తు చేద్దామని ఊం ఉవ్విళ్ళూరుతున్నాడని వదంతి. యెందుచేత వీడిలా చేస్తున్నట్టూ. తాంబూలం తక్కువైందనా!"

"ఏమో, మాకు మాత్రం ఆ ఉద్దేశం వున్నట్టు కనబడలేదండి. నిజమో అబద్ధమోగాని మొన్న సుశీలా టాకీసు మేనేజరు యిబ్రహీం ఐదువేలు ఆఫరుచేస్తే మస్తుగా చివాట్లుపెట్టి పంపేడని ఊరంతా గుప్పుమందండి."

"మరి? ఆనరసింహమూర్తి గురించి మరికొన్ని వివరాలు యివ్వండి."

"పొట్టిగా ఉంటాడండి. ఎడం చెంపమీద పుట్టుమచ్చ."

"ఏడిసినట్టుంది అతని అలవాట్లూసరదాలూ అవీ."

"ఆ మునిసిపల్ ఆఫీసులో ఎంతసేపూ తనరూంలో కూచుంటాడు. ఏవో లెక్కల్లో పద్దుల్లో మునిగి తేలుతూ ఉంటాడు. అవసరం లేనిదే మాటాడడు. ముందు యేర్పాటు చేసుకోందే కలుసుకోనివ్వడు. మునిసిపాలిటీ పాలిటి దూర్వాసముని అనుకోండి. అన్నీ టైం ప్రకారం జరగాలంటాడు.

"సరే ఒక్కొక్కరోజు బద్దకమేసి ఆ సూర్యనారాయణమూర్తే వేళపట్టున ఉదయించడూ, ఈ పిచ్చినాన్నకి టైం ఒకటా?"

"బాగా సెలవిచ్చారండి. ఆఫీసులో యెవరే మాత్రం ఆలస్యంగా వచ్చినా సామాన్యులం చూడండి—కడుపు ఉబ్బడం మొదలు కట్టుకున్నది యింట్లోకి రాకపోవడంవరకు అనేక యీతి బాధలు ఉంటాయి. అంత మాత్రాన ఎర్రసిరాతో మార్కు వేయించేయాలా?"

"సరే ఇంకెన్నాళ్ళులే, ఈ ఆఫీసు ఆడంబరాలెవరెరగని! మనకి కావలసింది ఆంతరంగికం, ఇంటిగుట్టు. తెలీలే?"

"ఓ సిగరెట్టు కాల్చడు. ఓ కాఫీ హోటలుకి రాడు, పేకాట ఆడ్డు. సరిగదా తాంబూలమైనా వేసినట్టు యెరగం."

"మరెందుకు జీవిస్తున్నట్టు?"

"ఏమో వీడి సిగతరగ. వెడితే గిడితే నూటికో కోటికో సినిమాకి వెడతాడు. అదైనా భార్యామణితో సహా. ఇంట్లో ఉన్నంతసేపూ పిల్లలతో ఆడుకుంటాడట. టైమ్ ఉంటే తెలుగుపద్యాలు పైకి చదువుతూంటాడని యెవరో విన్నవాళ్ళు చెప్పేరు. ఆయన రాస్తాడట కూడా."

శశాంకంగారి గుండ్రని గుడ్లు మిల మిల మెరిశాయి.

"ఇంకేం దొరికి పోయాడు దొంగ" ఆనందం పట్టలేక అరిచారు."

"అదేమిటి దానివల్ల అంత ఉపయోగముందా? నష్టమే ఎక్కువే" అన్నాడు ఒక శ్రోత. శాస్త్రిగారి ఒళ్ళు భగ్గుమండింది.

"ఎవడా తెలివి తక్కువమాట అన్నదీ? నష్టమే ఎక్కువా? రుజూ చెయ్యి చూదాం" శ్రోత ఒక చిన్న సంఘటన చెప్పేడు. ఇష్టం లేకపోయినా శాస్త్రిగారు కొంతసేపు శ్రోతకాక తప్పలేదు. ఆ చెప్పిన సంభాషణ యిలా నడుస్తుంది.

"సంస్కృతం మేష్టారు వున్న ఒక్క కూతురికీ ఊళ్ళో ఉద్యోగం వేయించి, కష్టపడి అల్లుణ్ణి వెతికి తెచ్చి, ఇల్లరికం వుంచుకున్నారు. కొన్నాళ్ళపాటు వుండి ఆ జామాత జై మాత అని జండా ఎత్తేశాడు! ఎంచేతో చెప్పగల్రూ?"

"ఏముంది మేష్టారు, అల్లుడి కుద్యోగం కూడా వేయించారుగా! ఏ నెల కా నెల జీతం తెచ్చి అణాపైసలతో ఒళ్ళో పోయమని ఉంటాడు — ఆ ధాటికి తట్టుకోలేక తోక జాడించాడేమో!"

"అబ్బె, అందుక్కాదు!"

"ఇల్లరికపు టల్లుడుగదా అని, ఇంట్లో మనిషేగదా అనీ అన్నిపనులూ అతనికే చెప్పివుంటారు. దాంతో మళ్ళీ కనబడి వుండడు. అంతేకదూ?"

"అదీ కాదుట."

"మరెందుకుటా."

"నే చెప్తాను వినండి" అన్నాడు శాస్త్రి. అందరూ అటు తిరిగేరు.

"మొదట్నుంచీ మాష్టారి అమ్మాయి ప్రవర్తన కొంచెం మంచిదికాదని చెప్పుకుంటారు. ఈ నాటికి యితగాడు మూడుముళ్ళూ వేశాడని ఆ చిన్నది తన స్వధర్మం మానుకో గలదా? అదేదో పీడికంటబడి వుంటుంది. దాంతో గుండె బ్రద్దలై పరుగుచ్చుకు వుంటాడు. అంతకన్న ఏముంది!"

"అలాంటిది పీడి కంటబడడం నిజమేటగాని వాడు చల్లగా దాటెయ్యడానికి మాత్రం అదంత ముఖ్యకారణం కాదట."

"మరి?" ఎర్రగా చూశారు శాస్త్రిగారు. శ్రోత మొదలెట్టేడు.

"ఆ అల్లుడు పరమ దయాళువు."

"అపర జటాయువు — కదూ?"

"వినండి మరి. ఎన్నిటినైనా నవ్వుతూ భరించగల మహా సహనశీలి. అతన్ని బాగా నొప్పెట్టించిన విషయం వేరు."

"అదేమిటేమి టేమిటి?" అందరూ ఒక్కసారే ప్రశ్నించారు.

"నాకు తెలిసినంతవరకూ కళాకారులు రెండే రెండు రకాలు. అసలైన ఆర్టిస్టులు అన్నంముద్ద కరువై ప్రజలచేత

ఏడిపింప బడుతూంటారు. అమాంబాపతు ఆర్టిస్టులు ఆహారం ఎక్కువై తమ కళావైదగ్ధ్యంచేత ప్రజల్ని ఏడిపిస్తూ ఉంటారు. మన సంస్కృతం మేష్టారు రెండోకోవకి చెందుతారు. ఆయన తెలుగులో పద్యాలు రాస్తారు. అక్షరలక్షలు ఎదురిచ్చినా అవి వినడానికి ఎలాంటివారూ సాహసించరు. అందుకని ఆయనకి శ్రోతకావాలి. అందుకే ఆయన అమ్మాయికి పెళ్ళిచేశారు. అందుకే అల్లుణ్ణి ఇల్లరికం ఉంచుకున్నారు. ఆ అల్లుడు ఏదైనా సహించగలిగాడుగాని పగలంతా పనిచేసి సాయంకాలం విశ్రాంతికోసం ఇంటికి వచ్చేసరికి – ఈ పద్యం నడక యెలా ఉంది? (మూర్ఛవాడు అరుస్తూ గిలగిలతన్నుకొంటున్నట్టుంది) ఇక్కడ కవిత్వధార ఎలావుంది? (సరిగ్గా పలు వరుస లేనివాడు పుక్కిలించి ఉమ్మినట్టుంది). ఇలాంటి చచ్చు ప్రశ్నలడిగి అదేపనిగా వేధిస్తే పలాయనం తప్ప అల్లుడికి మరొక పథాంతరం లేకపోయింది పద్యాలు వినలేక మనువేనా మానుకున్నాడు ఆ వెర్రి బ్రాహ్మడు!

శశాంకంగారి మొహం మళ్ళీ ప్రజ్వలితమైంది.

“ఎవరో ఓ వెర్రికుంక చేతకాక ఏదోచేశాడని అన్నిటా అలాగే జరుగుతుందా? అయిదు నిమిషాలు దాటకుండా ఆశువుగా చిన్న పద్యం పంపి ఆ నరసింహం ఆట కట్టిస్తాను చూడండి.”

వెంటనే చిన్న కాగితంమీద ఆయన కుదురుగా ఇలా రాశారు.

"కారుచీకట్లు చెండాడి కాంతినింప
దీనులందరి హృదయాల తృప్తిజేయ
భువిని అవతారమెత్తిన శివునిమూర్తి
వేరు ఎవరయ్యా, ఇది వినువారుగాక!

అది ఆయన పైకి చదివి అందరి చేతా భౌరా అనిపించుకుని వెంటనే ఒక నమ్మకస్తుడిద్వారా నరసింహంగారికి పంపించాడు.

"చూడబ్బాయ్, ఇది నువ్వే రాసినట్లు చెప్పు. నా పేరు పైకి రానియ్యకు" అని మరీ మరీ చెప్పేడు. "మహా నదులకి ఆనకట్టు కడుతున్నారు. మనస్సులకి ఆటకట్టు చెయ్య గలరా? అది మాకే తెలుసు!" అని శాస్త్రిగారు అనుకొనే లోగా జవాబు రానేవచ్చింది. అదీ పద్యమే. ఇలా ఉంది.

"కారు హెడ్‌లైట్ల కాంతికి కదలకుండ
చెవుల హారనెత్తు ధ్వనికైన చెదరకుండ
మంచిదారికి అడ్డుగా మధ్యనిలుచు.
దనుజ మహిషుడు ఎవ్వరు తమరుగాక!"

శశాంకంగారి కళా విహీనమైన మొహంచూసి అంతా బల వంతాన నవ్వు అపుకున్నారు.

"ఈ పద్యం నేను రాశానని చెప్పలేదుగదా."

"చెప్పవలసిందేనండి. తమరొద్దన్నారని సమయానికి జ్ఞాపకంవచ్చింది. ఎవరు రాశారని ఆయన రెండోసారి అడిగే

సరికి సంస్కృతం మేష్టారు పేరుచెప్పేశాను" అందరూ నవ్వేరు.

"పోన్లే బతికించావ్, నరసింహమూర్తీ. ఇంతటితో అయిపోయిందనుకోకు! నీలాంటి లోక కంటకులవల్ల వెనక ఇంద్రాది దేవతలు యిలాగే బాధపడ్డారు. నూలాంటివాళ్ళకు ఏదో అవతారం ఎత్తకా తప్పలేదు. సింహమూ కుందేలూ కథలో ఎవరు గెల్చారో ఎవరెరగనిది!"

ఓటమి అంగీకరించని శశాంకం అందరూ ఆశ్చర్య పోయి చూస్తూండగా విస విస నడిచి వెళ్ళిపోయారు.

అంతేఆనాటినుంచిశశాంకశేఖరశాస్త్రిమరింతతీవ్రంగా ఆలోచించడం ప్రారంభించాడు. 'ఎప్పుడు, ఎక్కడ, ఎవడు ఎంచక్కా ఏ రోగంతో బాధపడతాడా!' అని ఎదురు చూడ్డం వైద్యధర్మం. రోగం ఆచూకీ తెలిస్తే రోగం తగ్గకుండా రోగి చావకుండా అలా, అలా, ఆకట్టుకువచ్చి వైద్యులు ఆరోగ్యవంతంగా బతకొచ్చు. కాని రోగమే అంతుపట్టకపోతే, చికిత్స ఎలా చెయ్యడం. అన్ని విధాలా ఉక్కుముక్కలా ఉన్నవాణ్ణి చూసి వైద్యుడు చిరాకుపడట్టు నరసింహంగారి గురించి బుర్రబద్దలుకొట్టుకొని శశాంకం మహా బాధపడిపోయాడు. ఈఊరు ఇలా బాగుపడిపోవలసిందేనా, దీని కింకేం మార్గంలేదా_దేవుడులేడా, సత్యం జయించదా అని ఆయన మనసు పాపం అల్లల్లాడిపోయింది.

ఆవాళ మునిసిపల్ హైస్కూలు కొత్తలైబ్రరీ భవనా

నికి ప్రారంభోత్సవం జరిగింది. నరసింహంగారు ఊరంతా తీర్చి దిద్దడానికి వేసుకున్న ప్రణాళికలలో తొలివిజయం యిది. ఒక్క మంచిపని చెయ్యడానికి యెంత కష్టపడాలో అంతా ఆయన దీనికోసం పడ్డాడు. ఆస్కూలు హెడ్మాష్టరుపేరు శశాంకంగారు. మరోక విధంగా పలుకుతారని ఆయన ఆ పేరుని ఇంగ్లీషులో రాసుకోడానికి జంకుతాడు. ఆయన స్కూల్లో లెక్కలు చెబుతాడని పిల్లలు చెబుతారు. కాని, స్కూల్లో స్పెషల్ ఫీజు సర్దుబాటులో యే లెక్కా తేల్చి చెప్పడనీ ఎవరినీ లెక్క చెయ్యడనీ పెద్దలుచెబుతారు. అలాంటివి ఏనాడో గ్రాంటు అయిన లైబ్రరీ భవనాలసొమ్ము తాలూకు కాగితం వెతికి తీయించి, ఆ భవనం అవసరం వున్నది వాళ్ళచేత జోడించి రాయించి, పై అధికారుల ఆమోదముద్ర పొంది – దగ్గిరుండి అది కట్టింపించారు. ప్రభుత్వవిద్యావిధానప్రధానాధికారికి రాసి తగిన విరాళం సంపాదించి పిల్లలు కూచుని చదువుకునేందుకు అవసరమైన ఫర్నిచరూ, వెయ్యిపుస్తకాలూ సేకరించాడు.

"బుల్లి బుల్లి బొమ్మల్లాంటి పిల్లలు బుల్లిబుల్లి బొమ్మల పుస్తకాలు అటూ ఇటూ తిరగేస్తుంటే చూడ్డానికి యెలా వుంటుందంటావ్, బుల్లీ?" నరసింహమూర్తిగారు భార్యని అడుగుతూంటే ఆమె హాయిగా నవ్వింది. అదే సమయంలో కారు ఆగింది. ఆ యింటి ముందు శశాంకంగారు దిగేరు.

"వీరు శశాంక శేఖర శాస్త్రిగారని పండితులు, ప్రాజ్ఞులు" పరిచయం చేశాడు.

"నమస్కారం దయచేయండి,"

"తరవాత మళ్ళీ యెలాగా వస్తాను. అక్క డందరూ సిద్ధంగా ఉన్నారు. తమరు దయచేయడమే తరువాయి."

"దేనికి?"

కళాంకంగారు చెప్పేరు.

"బాగుంది. ఇవాళ మన గ్రంథాలయం ప్రారంభో త్సవం, మంత్రిగారు కూడా వచ్చేశారు. మీరు అధ్యక్షత వహిస్తారని అచ్చుకూడా ఇచ్చేశాం. మిమ్మల్ని చూడాలనీ, మీ మాటలు వినాలనీ పెద్దలతో పాటు పిల్లలుకూడా వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తున్నారు, కాదనకండి."

"క్షమించండి. నిర్వీర్యమైన ఈ శంకుస్థాపనలూ, శ్రాద్ధ ప్రాయమైన ఈ ఉత్సవాలూ వీటిలో నే పాల్గొనలేను. పరిశుభ్రంగా వున్న చిన్న బీద బాలికచేత 'తల్లీ నిన్నుదలంచి' చదివించి ఆ భవనం తెలుపులు తెరిపించండి. ఇదివరకులా పిల్లలకి అన్యాయం చెయ్యననీ, ఆ భవనం తెలుపులు ఏ కారణంచేతా మూయించననీ నాకు వాగ్దానం చెయ్యండి. ఇంత చిన్నవయసునుండీ లేతమనస్సుల్లో ఈ పటాటోపాలూ, ఆడంబరాలూ నాటడం నేను సహించలేను."

కళాంకం శశాంకంవైపు చూశాడు. ఇతడు అందుకున్నాడు.

"పోనీ మీ కిష్టం లేదంటే మీటింగులో మాటాడొద్దు. వచ్చి కూచోండి. అన్ని యేర్పాట్లూ జరిగిపోయాక

మీరు రాలేదంటే అందరూ యేమనుకుంటారు? అందరి మాటా వదిలెయ్యండి. వాళ్ళకోసం ఇంత కష్టపడిన మిమ్మల్ని చూద్దామని యింతింత పిల్లలు గంటల తరబడి కనిపెట్టుకున్నారు ఇలాంటి రోజున వాళ్ళ మనస్సు నొప్పిస్తారా?"

అనుకున్నారుగాని నరసింహమూర్తిగారు కారెక్కక తప్పలేదు. ఆనాటి కార్యక్రమంలో గద్దెక్కకా తప్పలేదు! నోరువిప్పకా తప్పలేదు.

"పూజించవలసిన పుస్తకాలయం యిది. పూర్తిగా విడవని పువ్వులు మీరు. ఈ వాతావరణం ఎంత అందంగా వుండాలి మరి! ఎక్కడా ఓ కాగితమ్ముక్క పడెయ్యకుండా, తెల్లని గోడమీద ఒక పిచ్చిగీత గియ్యకుండా బుద్ధిగా నిశ్శబ్దంగా చదువుకోవాలి. ఏం అలాగే ఉంచుతారా?"

"ఓ" అన్నాయి కొన్ని వందల సన్నాయిలు. నరసింహం గొంతుక వేడెక్కింది. ఈసారి ఆయన ఉపాధ్యాయుల బెంచీవైపు దృష్టి మళ్ళించాడు.

"పరమ పవిత్రమైన పాఠశాల మీ యిల్లు, పరమాత్మ ప్రతిబింబాలయిన పసిపాపలు మీ పిల్లలు. సాక్షికమూ ప్రలోభమూ కాక పరమార్థమే మీ ప్రయోజనం కావాలి అవునా'"

"నడిసినట్టేవుంది. ఎవడిక్కావాలి నీ నీతులు! ఎక్కడ కొట్టుకొచ్చావో ఈ కొటేషన్లు? ఫానుకింద కూచుని వేలకి వేలు లాగడం అనుకున్నావు కాబోలు. ఇలా ఎందరున్నారో

అన్నిరకాలు" లోలోపల గొణుక్కున్నా పంతులయ్యలు పైకి మాత్రం 'కాదుమరీ, ఎంతమాట? చిత్తం, ఆయః" ఇలాంటి ఉద్యోగ ధర్మపు నుడికట్లు వదిలారు. ఆప్రశంసలు వినగానే నరసింహం బుగ్గలు ఎరుపెక్కాయి. ఈ సారి ఆయన వూరి పెద్దల్ని సంబోధించారు.

"మీ పిల్లలు పై చదువులకి వెళ్ళే మొదటిమెట్టు ఇది. మీ వంశాకురాల జ్ఞానాంకురం యిక్కడే. ఇన్నాళ్ళతరబడి యిదిలావుంటే యెలా వూరుకున్నారు? మీ బాధ్యత మీకు లేదా? మీ పిల్లలబాగు మీకు అక్కర్లేదా? ఈ స్కూలూ, ఈ పేటా, ఈ వూళ్ళో ప్రతి అంగుళమూ మీది కాదా? మీ యిల్లు చక్కదిద్దుకోడం మీ కనీస కర్తవ్యం అవునా?

"ఓ" అన్నాయి కొన్నివేల కాకులు. అలా అన్నా అక్కడితో ఆపుతాడేమోనని, అలాగైనా తరువాత డ్రామా ప్రోగ్రాం వెంటనే ప్రారంభమౌతుందేమోననీ అందరూ కలసి చప్పట్లవర్షం కురిపించారు.

అవతలివాళ్ళు వింటున్నారో లేదో అన్న కనీస సానుభూతైనా లేకుండా గంటలు గంటలు చెవుల్లో గుండెల్లో మంటలుపుట్టించే ఉపన్యాసకుల్ని వేలకొద్దీ చూశాం. ఖంగు ఖంగుమని నాలుగే ముక్కలుచెప్పి, అందరినోళ్ళూ కట్టించి, అక్కడే అవుననిపించి, బతికున్నన్నాళ్ళూ రింగు రింగుమని చెవుల్లో ఆ ముక్కలు వుండిపోయేలాగ — "నరసింహమూర్తి గారూ! ఇవాళ యెంత క్లుప్తంగా, ఎంతచక్కగా చెప్పేరండీ!"

తిరిగి వస్తున్నప్పుడు శశాంకం అని దీక్షగా మూర్తి మొహం వైపు చూశాడు. ఇది ఆఖరుది. సమ్మోహనాస్త్రం. దీనికి తిరుగుండకూడదు మరి. మూర్తి శాస్త్రి వైపు తేరిపార చూడలేకపోయాడు. సంతృప్తితో నిండిన బలిమితో అతని రెప్పలు వాలిపోయాయి.

"ఇంటికెళ్ళి మా ఆడవాళ్ళకి చెప్పాలి. చిన్న చిన్న ముక్కల్లో నక్కని చక్కెర అద్ది ఎంచక్కా యెలా తినిపించ వచ్చునో... ఏదేదీ, ఓ చోట రాసుకుంటాను చెప్పండీ ... పూజించవలసిన పుస్తకాలయం యిది...... పూర్తిగా విడవని ...ఏమిటీ, చెప్పండీ మూర్తీ?"

మూర్తి చెప్పలేకపోయాడు. అతని మాటలు తడ బడ్డాయి.

"నోటికి వచ్చింది అప్పటికప్పుడు వాగేశానుగాని నాకు మాత్రం యేం జ్ఞాపకం? మీ వెర్రిగాని అందులో యేమంత సారం ఉందని! చెబితే నమ్మరుగాని నేనేం చెబుదామని వచ్చానా? కాని 'ఇప్పుడు అధ్యక్షులు ఉపన్యసింతురు' అని హెడ్మాస్టరుగారు అనగానే యేం చెప్పాలో తోచక అప్పటి కప్పుడు యేదో అనేశాను. మీరు భద్రాజుపని బాగానే చేస్తున్నారుగాని దానికంత యెఫెక్టు ఉందనుకోను. అదిగాక ఈ ఉపన్యాసాలమీద నాకు మొదట్నించీ ఏ మాత్రమూ మంచి అభిప్రాయంలేదు. నేను లెక్చర్లివ్వలేదు సరిగదా ఏ మీటింగు లోనూ చివరిదాకా కూర్చోలేక పోయేవాణ్ణి. అలా నేను చేయడానికి నాకు స్టేజిఫియరు కారణమనీ, ఉపన్యసించిడం నాకు చేతకాదు గనకనే అదంటే నాకంత మంటనీ చాలా

మంది అభిప్రాయం. అలాంటిది ఇవాళ ఇలా ఎందుకు మాటాడనో నాకే ఆశ్చర్యంగా ఉంది!' ఆశ్చర్యానికేముంది, సర్వజనాను రంజకమైన నీ ఆత్మహత్య ఈ క్షణంనుంచి ప్రారంభమైంది గనక అనుకున్నాడు తృప్తిగా శశాంకం.

"ఏమిటి మీ అభిప్రాయం చెప్పరేం? నేనిలా మాటాడ్డం ఆశ్చర్యంగా లేదూ?"

"ఆశ్చర్యానికేముంది ఆత్మసాక్షాత్కారం పొందేరు. అంతర్వాణిని అందుకున్నారు. అంతకన్నా కోరేదేముంది, అవిఘ్నమస్తు!" అన్నాడు పైకి.

"ఏ_మి_టో పెద్ద పెద్ద మాటలు వాడుతున్నారు. నాకేం అర్ధం కావడంలేదు. చేసి చూపించాలిగాని కబుర్లవల్ల కలిసివచ్చేదేముంది?"

"అమ్మ ఎంతమాట సెలవిచ్చారు! మనసులమీద ఇక వాక్సుద్ధిగల వ్యక్తుల ప్రభావమే లేదంటారా ప్రపంచంలో? వెనకటికి మా ముత్తాతగారు ఒక విద్వత్సభలో పాతపద్ధతుల ప్రతిభ గురించి సెలవిస్తూ వచ్చారట. ఆసందర్భంలో గుండు గొప్పతనాన్ని గురించి పలకల వైశిష్ట్యాన్ని గురించి సశాస్త్రీయంగా చర్చించి క్రాఫింగుల కానితనం నిరూపించగా మీటింగు అయిపోనిచ్చి నూటికి తొంభైమంది సభికులు కుమ్ములాడుకుని గుళ్ళు చేయించుకున్నారని చెబుతారు." మూర్తిగారు నవ్వుతూ అన్నారు.

"వినటానికి బాగానే వుందిగాని, ఇదెవరు నమ్ముతారు? కట్టుకథ?"

"అవును. అలాగే అనుకోండి. మీ ఆరాధ్యదైవం వివేకానందుడు అమెరికాలో సాధించిన అపూర్వ విజయం కూడా కట్టుకథే కదూ?"

మూర్తి మాటాడలేదు. శాస్త్రి మాటాడనివ్వలేదు కూడా.

"నేను బలవంతాన మీ మీద కొత్త అభిప్రాయాలు రుద్దదలుచుకోలేదు. బుద్ధిమంతులు, మీరే ఆలోచించండి. సత్పథంలో సక్రమంగా విధి నిర్వహణ చేసే అతి కొద్దిమందిలో ఒకరైన మీరు — మరింతగా ప్రజానీకాన్ని మంచివైపు మళ్ళించాలంటే పదేపదే బోధపరచవలసిన అవసరం లేదంటారా? ఉపన్యాసాలన్నీ సార విహీనంగానూ చర్విత చర్వణంగానూ తయారవుతున్నమాట నిజమే. దెబ్బలు తగులుతాయని ఫుట్‌బాల్ ఆట మానుకుంటామా? అమాయక ప్రజల అజ్ఞాన తిమిరాన్ని పారద్రోలి జ్ఞానభిక్ష పెట్టవలసిన బాధ్యత మీకు లేదంటారా."

మూర్తి అప్పటికీ మాటాడలేదు.

"ఇంతకీ మెమ్మెమ్మె అనే ప్రతీదీపం సెమ్మెగాణ్ణే నేను ఎగసన దొయ్యాను. భగవంతుడు మీకు సుశబ్దమూ యిచ్చాడు. మూడుపువ్వులూ ఆరుకాయలూ కాయించగల వాచాలత అందరికీ అబ్బుతుందా. మీ గళం అనర్గళంగా, మీ కంఠం కలకంఠంలా..."

"ఈ పొగడ్తల కేమొచ్చెగాని ఒకటి అడుగుతాను అతిశయోక్తి లేకుండా చెప్పండి. నా గొంతుక మైక్‌కి సూట్ అయిందంటారా."

"ఏమో అదంతా నాకు తెలియదుగాని మీరు మాటాడుతూంటే మధ్య ఓ సారి రెండు సెకండ్లుపాటు మైక్ ఫెయిలయింది, గమనించారా. ఎంచేతంటారు. మీ విద్యుత్ ప్రవాహం తాత్కాలికంగా ఆగిపోయిందంటారా."

"కాదు, విద్యుత్ ప్రవాహం ఆగిపోయిందేమో!"

"అదీకాదు, నే చెబుతా వినండి. అసలు ఆ మైక్‌ని చూడగానే మైకంపొందని వక్తలు అరుదు. పరాకాష్టనందుకున్న భక్తిభావనలా వుపన్యాసకులకి ఆ టైములో తామూ, ఆ మైక్రోఫోనూ తప్ప నుదొకటుందని భావమే గోచరించనంతగా 'మహామైకం' పొందుతారు. అలాంటిది మైమరపించే మీ ఉపన్యాసం వినగానే ఆ మైక్‌కే మైకం కమ్మిందండీ బాబూ! అందుకే అది కొంతసేపు పనిచెయ్యలేదు!"

"ఎంత చిత్రంగా మాటాడతారు మీరు!"

"నా మాటలు మీ దగ్గిరే. మీ మాటలు ప్రజల ముందు. ఏమంటారు?"

"ఇక ఇలాంటి స్తుతిపాఠాలు మానేద్దురు బాబూ!"

ఇది నరసింహం కేవలం నోటిమాట. అతని మనసు ఎంత వద్దనుకున్నా ఇంకా అలాంటివి కోరుతూనేవుంది.

*　　*　　*

ఆ తరువాత నరసింహమూర్తిగారు వరసగా చాలా సభలకి అధ్యక్షత వహించడం జరిగింది. అలా కాకపోతే ప్రధాన ఉపన్యాసకుల్లో ప్రథమ స్థానం ఆక్రమించడం జరిగింది.

"నరసింహంగారు కబుర్లరాయుడు కాదు. అసలైన కార్యవాది" అనే ప్రజావాక్యం కొన్నాళ్ళకి 'కార్యవాదే కాదు, మంచి మాటకారి కూడా' అని మారి చివరికి 'గొప్ప వ్యక్తి' అని స్థిరపడిపోయింది. డబ్బు యెక్కువై సహజంగా మానవత మరచిన కొన్ని 'వార్తాపత్రికలు' నరసింహమూర్తిగారు చేసిన ప్రజాహితకార్యాలకి ఏనాడూ అంత ప్రాధాన్యత యివ్వనివి, వక్తగా ఆయన శక్తి సామర్థ్యాల్ని ఆకాశానికి యెత్తేయి. నిద్రాణమైన తన శక్తిని మేల్కొలిపినందుకు మూర్తిగారు శాస్త్రిగారికి కృతజ్ఞత చెప్పకోడంకూడా జరిగింది.

*　　　*　　　*

"చూడండీ ఎలా వుందంటారు?"

ఆవాళ తను తయారుచేసిన ఉపన్యాసం శాస్త్రికి చూపించాడు మూర్తి.

"అంతటా లంచగొండితనం. ఎంతకని భరించడం?" అన్నది విషయం.

మంత్రి క్షవరము చేయును అని చిన్నప్పుడు అందరూ చదువుకుని వుంటారు. ఇంతగా అనుభవించిమాత్రం వుండరు. ముఖ్య పదవులలోవున్న కొందరు అమాత్య శేఖరులే అన్యా

యపు పనులు చేస్తూంటే — రుజువైనాకూడా ప్రభుత్వం యెలాంటిచర్య తీసుకున్నట్టు, ఎందుకు ఆలస్యం చేస్తున్నట్టు? చిన్న ఎలకపిల్ల ఒకటి మనింటికి వచ్చి నాలుగు బియ్యపు గింజలు కొరికిందని బోనుపెట్టి బంధిస్తున్నాం. మామూలు మనిషికీ మహామంత్రికీ మనదేశంలో ఒకేరకం న్యాయం లేదా? ఎలా వెడుతోందంటారు?"

"బ్రహ్మాండంగా వుందిగాని, ముందు యిలా రాసుకోడం దేనికి, ఇదో టైం వేస్టుకదూ? నూటొకసారి గొంతుక సవరించేవాళ్ళూ, అవాకులూ - చవాకులూ ఆలాపించేవాళ్ళూ యిలా రాసుకు చదువుతారుగాని, అరి తేరిన మీకీ ఖర్మమేం అని?"

"నిజమేసుమండీ, ఆలోచించనే లేదూ!"

"సార్ ..."

"ఎవరదీ మధ్యలో?" శశాంకం కసురుకున్నాడు.

"నేనండీ సుబ్బరాజుని ... ఇవాళ వెటర్నరీ హాస్పిటల్ లెక్కలు తణిఖీ చేస్తానన్నారు, పదింటికే నన్ను అక్కడ వుండమన్నారు. గంటపైగా చూశాను. ఇప్పుడేనా వెడదామా?"

"ఎవళ్ళ బుద్ధి వాళ్ళకుండాలిగాని, ఎంతకని సవరించ గలం? ఇప్పుడు వెళ్ళకపోతే మించిపోయింది ఏముందీ?"

"నేను మిమ్మల్నడగలేదు" అన్నాడు సుబ్బరాజు.

"నేను మీతోనూ చెప్పడం లేదు" అన్నాడు శశాంకం. నరసింహం వాళ్ళిద్దర్నీ వారించాడు.

"మీ జవాబూ అదే అయితే శలవు తీసుకుంటాను" అన్నాడతను.

"పోనీ ప్రస్తుతానికి వెళ్ళకండి, ఇప్పుడు నేనూ బిజీగా వున్నాను. అవసరమైన కాగితా లేవో తయారు చేస్తున్నాను" వెళ్ళిపోతూ అతను వెనక్కి తిరిగేడు.

"మాడండి, ఇది చెప్పవలసిన టైమూ, నేను చెప్పవలసినవాణ్ణీ కాదని నాకు తెలుసు. ఐనా వుండబట్టలేక వెళ్ళగక్కుతున్నాను మీ రేమనుకున్నా సరే. సత్యపథం అరంగుళం తప్పనని, సమయానికి అరనిముషం ఆలస్యం చెయ్యననీ, సర్వసుందరంగా మన ఊరు తయారుచేస్తాననీ మంచివాళ్ళందరికీ గంపెడాశ కల్పించారు మీరు. మధ్యలో ఎందుకిలా మారిపోయారు? ఏ నీచగ్రహం మిమ్మల్ని ఆశ్రయించింది."

"నేను వెళ్ళొస్తాను మరి......"

శశాంకం లేచాడు. వీలైనంత కోపంగా చూస్తూ "అదేంటి, కూచోండి."

"ఎందుకూ, ఇంకా మాటలు పడ్డానికా. మీరు దగ్గరుండికూడా చూస్తూ కూచోడానికా."

"అలాకాదు, కూచోండి. చూడమ్మా సుబ్బరాజూ! మనం మళ్ళీ కలుసుకుందాం."

"అంతకంటె మరేనుంటారు లెండి. ధర్మదేవత కుంటి దయిన కాలం యిది. మీరేం చేస్తారు" సుబ్బరాజు చర చరా నడిచి వెళ్ళిపోయాడు.

"నేను పెద్దవాణ్ణి మీరేవీా అనుకోకపోతే చనువు తీసుకుని చిన్న సలహా యిస్తాను"

"ఏమిటది." అన్నాడు మూర్తి తల రెండు చేతులతో చిరాకుగా పట్టుకుని.

"వంద మించి జీతంలేని ఆ పంద ఇవాళ యిలా ఎదురు పడి మీాకే చెప్పబోయాడంటే ఆలోపం ఎవరిది. 'సర్వసమా నత్వం' అనే అర్థరహితమూ, అనర్థసహితమూ అయిన మాట పట్టుకుని అడ్డమైన వాళ్ళని నెత్తికెక్కించుకుంటే ఏమౌతుంది. తరతరాల నుంచి వస్తున్న తరతమాలు లేవా."

"అబ్బబ్బ విషయం మూార్చండి" అన్నాడు మూర్తి మరింత విసువుగా.

"ఇందాక మీా ఉపన్యాసం సరిగా పూర్తిగా వినలేదూ. ఏదేదీ."

అంతలో మరెవరో వచ్చారు.

"నేను బాబూ తోటమాలి పాముగాణ్ణండి. మన మునిసిపల్ పార్కులోని కొత్తగులాబీ అంట్లు సగానికి సగం వేళ్ళతో సహా తాసిల్దారుగారు పీకించి పట్టుకు పోయారు బాబూ. నేను అడ్డుపడితే నీవెక్కున్న చోట చెప్తానో అన్నారు బాబూ."

ఈసారి శశాంకమే అందుకున్నాడు.

"చూడమ్మా సామూ. ఆ తోట ఎవరిది. నీదీ, నాదీ కాదు. ప్రజలది. అవునా. ఇంక ఆ అంట్లు తవ్వించుకు వెళ్ళిందెవరూ. నువ్వూ, నేనూ కాదూ. ప్రజలందరికీ న్యాయం ప్రదానం చేసే పెద్ద ఆఫీసరుగారు. ఎవరిసొమ్ము వారు పట్టిగెడితే అడ్డుపెట్టిందేకాక, ఫిర్యాదు ఒకటూ. ఏమంటూ వచ్చావ్ వెళ్ళెళ్ళు."

"అయ్యగారూ తమరేమిటి శలవిస్తారు."

"నిన్న తక్షణం దయచెయ్యమని. అంతకన్న ఏముంది ఆయనొక రాచకార్యంలో మునిగి తేలుతున్నారు. చూడ్డం లేదా? పదపద."

సాముగాడు వెళ్ళిపోయాడు.

శాస్త్రి మూర్తిమొహం చూశాడు.

"మీ మనసెందుకో బాగులేనట్టుంది. నీతిమార్గం తొక్కుతూంటే చూళ్ళేక యిలాగే లోకకంటకులు అడ్డొస్తూంటారు. నిలదొక్కుకుని అడుగు ముందుకు వెయ్యాలిగానీ అధైర్య పడకూడదు. ఇప్పుడే వస్తానుండండి"

పది నిముషాల్లో అతను 'టేప్ రికార్డరు' తో సిద్ధమయ్యాడు.

"హైస్కూల్‌లోది. మొన్ననే ఆడియో విజువల్ ఎడ్యుకేషన్ ఫండు తరపున తెప్పించారు. మొన్నటి మీ స్పీచి రికార్డు చేయించాను. దానిగురించి నేను ఉన్నదున్నట్టు చెబితే ఆకాశాని కెత్తేశానని ఆడిపోసుకున్నారు గదూ. ఇప్పుడు మీ

చెవుల్లో మీరే విందురుగాని" అని శశాంకం ఉపరికార్తుని సంబోధిస్తూ.

"ఏమే యదార్థవాదినీ, సత్యస్వరూపిణీ! నువ్వేనా వున్నదున్నట్టు చెప్పి మీ అయ్యగారికి జ్ఞానోదయం చెయ్యి" అంటూ స్టార్టు చేశాడు.

"ఇప్పుడు మన స్పెషల్ ఆఫీసర్ కె. వి. నరసింహమూర్తిగారు నావారూ, చైనావారూ అను విషయంపై నాలుగ ముక్కలు చెబుతారు......

సోదరులారా, రసోదరులారా!..."

తన ఉపన్యాసం వింటూ పడకకుర్చీమీద పడుకుని తలక్రింద చేతులు పెట్టుకుని కళ్ళు మూసుకున్నాడు మూర్తి. శశాంకం దగ్గరగా వంగి అతని మొహం చూశాడు. అచ్చు పడ్డ కథ చూసుకున్నట్టు, అద్దంలో మొహం చూసుకుంటున్నట్టు—పెదవులుదాటి వస్తున్న ఆ చిరునవ్వు తుంపరలూ, ఆ నునుసిగ్గు దొంతరలూ— చాలు శశాంక విజయానికి యీ ఋజువులు చాలు.

గోడగడియారం రెండు గంటలు కొట్టగానే మూర్తి ఉలిక్కి పడ్డాడు.

"అయ్యయ్యో! ఎంత వేళయి పోయిందో ... ఇవాళ ఆఫీసుకి సి. ఎల్. పంపేస్తాను."

శశాంకం పకపకన వ్వేడు.

"ఎన్నాళ్ళయినా ఒక్కలా వున్నారు మీరు. ఏనా నా

వెర్రిగాని పరీక్షలంటే చకచక పాసయ్యారుగాని దానికి తగిన వయసేది మీకు? ఈ పంక్చ్యువాలిటీ అన్నది యెంగిలి మెతుకు. పరదేశీయులు వదలి వెళ్ళిన తుంటరి సరుకు. పనులు జరగడం ప్రధానంగాని యేవేళకైతేనేం? ఇంతకీ మీరు ప్రతి నిత్యం పారాయణంచేసే గీతలో చెప్పినట్టు డ్యూటీ చెయ్యాలనే సత్సంకల్పమే ఆత్మకి కలగాలిగాని, యీ పాడు శరీరం ఇంట్లోవుంటేనేం, ఆఫీసులో వుంటేనేం? ఊళ్ళోనేవుండి క్యాంపులో ఉన్నట్టు చెప్పకోడమూ, ఒక్కనాడే పదిరోజుల డైరీ రాసెయ్యడమూ, ఏవేళకి ఆఫీసుకి వెళ్ళినా సంతకం క్రింద పదంకె వెయ్యడమూ — ఈ ఆపద్ధర్మాలు అంతగా అధర్మాలా? మీమటుకు మీరు ఇంటిపట్టున వుండి సొంతకార్యమేదేనా చక్కబెట్టుకుంటున్నారు గనకనా! ప్రజాహితంకోసం ఒక్కలా బాధపడిపోతున్నారుగాని! మీ నరసింహగర్జన విని ఏనాటికైనా నిద్రాణమైవున్న జాతి మేల్కొనకపోదు. మాలాంటి పెద్దవాళ్ళ బోధనలూ_దీవనలూ ఊరికేపోవు!»

నరసింహమూర్తిగారికి ఆఊరినుంచి ట్రాన్స్ఫరయింది. వీడ్కోలుసభ చాలా ఘనంగా జరిగింది. మొదట్లో ఉద్యోగ నిర్వహణలో కొద్దిగా వెనకబడినా క్రమ క్రమంగా ఆయన చూపిన చురుకుతనాన్ని పెద్దలందరూ పలువిధాల ప్రశంసించారు. ఒకర్ని పొగడ్డంకోసమే పుట్టి పెరుగుతున్న కొందరు కవులు మత్తేభాలతో శార్దూలాలతో సర్కస్ చేయించారు. అందరూ కలసి ఆయన అనన్యకృషికి చిహ్నంగా పదివేల రూపాయల పర్సుకూడా ప్రజంటు చేశారు. మొదట్లో వద్దని

మొహమాట పడ్డారుగాని కష్టపడితే యిచ్చారుగాని 'ఊరికే ఇవ్వలేదుగదా!' అనిస్వీకరించారు. ఆఖర్ని రెండుగంటలసేపు ధారాళ"గా ఉపన్యసించారు.

"నువ్వేం మాటడలేదేం?" శశాంకమూర్తిని ఒకరు ప్రశ్నించారు.

"వారు చేసిన కృషిఫలితమే ఇది" అన్నారు మరొకరు.

శశాంక శేఖరమూర్తి జేబులోంచి చిన్న కాగితం తీశాడు.

"ఇదే నేనిచ్చే బహుమానం" అంటూ.

ఆ కాగితంలో ఇలావుంది:

"నరసింహం ... మృగరాజమధ్యముని ప్రేమించిన మృగరాజశేఖరుని కథ నీకు తెలుసా? తెలిసినా నువ్వు మళ్ళీ వినవలసిన అవసరం వుంది విను. ఒక సింహం ఒక చిన్నారిని లవ్ చేసింది. కాబోయే మామయ్యని పెళ్ళి చెయ్యమని అడిగింది! నీగోళ్ళు చూస్తే నా కూతురు గోలెడుతుంది. నీ కోరలు చూస్తే మా అమ్మాయి పరిగెడుతుంది. సుబ్బరంగా జూలుకూడా కత్తిరించుకుని చక్కగా క్రాఫింగు చేయించు కురా."

ప్రేమపాశంలోపడ్డ సింహం పాపం అలాగే చేసి వచ్చింది.

'కొరకడానికి కోరలూలేక గీరడానికి గోళ్ళూలేక నువ్వె

క్కడి పాతసింహాసనివి, గ్రామసింహానివి కాళ!' అని మామయ్య దాన్ని కుక్కనికొట్టినట్లు తరిమి తరిమి కొట్టేడట!"

మళ్ళీ ఏమనుకున్నాడో ఆ కాగితాన్ని చింపేశాడు

"అతడేమిటో, అతని తప్పేమిటో అతనికి బోధ పడక పోడమే మంచిది. లేకపోతే మరోఊరు పాడుచేసేను! చేజే తులా మనుషులు పాడైపోతే మాలాంటివాళ్ళం చూస్తూ ఊరుకోగలమా? మాలాంటి వారి గురించే అనుకుంటారు 'సంభవామి యుగే యుగే!అని' అనుకున్నాడు శశాంకం సగర్వంగా.